


# ముఖ్యమంత్రులూ – ముసిరే దోమలూ

*అమెరికామెడీ కబుర్లు -5*



నేనే కాదు, మీరు కూడా గమనించే ఉంటారు. ప్రస్తుతం అమెరికాలో ప్రస్తుత మరియు మాజీ ఆంధ్రా ముఖ్యమంత్రుల సీజనే కాక అదే కేటగిరీకి చెందిన అమాత్యుల అమెరికా పర్యటనలు కూడా భారీగా ఉన్నాయి. గత నెలలో ప్రస్తుత ముఖ్యమంత్రిగారు అమెరికా వచ్చేస్తే...సారీ..విచ్చేస్తే...ఈ నెల మాజీ ముఖ్యమంత్రి గారు అమెరికా విచ్చేశారు..సారీ ..వచ్చేశారు. మీకు కూడా తెలుసుగా... పదవిలో ఉన్న వారు సగౌరవంగా విచ్చేయుదురు. లేని వారు మామూలుగా వచ్చుదురు.. ముఖ్య మంత్రి అయినా, పోర్ట్ ఫోలియో లేని మంత్రి అయినా, తనకున్న పోర్ట్‌ఫోలియో ఏమిటో తెలియకపోయినా మంత్రి పుంగవులు అందరికీ అమెరికా ఇప్పుడు రావడానికి మొదటి కారణం మటుకు ఒకటే.....వచ్చే ఏడు రాబోయే ఎన్నికలకి అందరి డబ్బూ, దస్కం, కులం, గిలం ..అంటే స్వకులం వారి అండదండలూ, డొనేషన్‌లూ, పరాయి గిలం వారిని తమ వేపు తిప్పుకునే మార్గాన్వేషణలూ ఇలాటివన్నీ అన్వేషించడానికే అని నా బోటి వెరీ బ్రిలియంట్ వెర్రి వెధవాయికి కూడా తెలిసిన చిదంబర రహస్యం. అమెరికా తిరనాళ్ళలో మన వేపు ఎలా తిప్పుకోవాలీ అనే సమస్య బాగా డబ్బున్న వాళ్ళ తోటీ, మధ్య తరగతి వాళ్ళ తోటీ మాత్రమే. బీదా, బిక్కీ, బడుగూ, గిడుగూ, చదువూ, సంధ్యా లేని ఓటర్లని డబ్బూ, గిబ్బూ, సారా, గీరా మొదలైన వాటితో మార్కెట్ రేటు ప్రకారం కొనుక్కోవచ్చుగా. అది ఏ మాత్రం ఇబ్బంది లేని పనేగా.

నేను గత కొన్ని దశాబ్దాలుగా రిసెర్చ్ చేసి కనిపెట్టిన ప్రాధమిక సూత్రం ఏమిటంటే..... ఏ మంత్రిగారైనా వస్తున్నారు అనగానే ఆయన వర్గం వారు అమెరికా అంతటా ..ముఖ్యంగా సదరు మినిస్టరు గారు విచ్చేసే నగరాలలో ప్రైవేటు మీటింగులు పెట్టుకుని, మొదటి దండ ఎవరు వెయ్యాలి, స్టేజి మీద ఎవరెవరు ఎక్కడ కూచోవాలి, ఆయనకి ఇవ్వగానే, "ఈ చెత్తంతా ఇండియా దాకా ఎవడు మోసుకెడతాడులే" అని ఎవరూ చూడకుండా చెత్త డబ్బాలో పారేసే పతకమూ, ప్రశంసా పత్రమూ, ఎంతో జాగ్రత్తగా ఇండియా తీసుకెళ్ళే గిఫ్టులు, అంటే తైవాన్‌లో తయారయిన అమెరికా చెడ్డీలూ, మరియు ఆయన తాలూకు ఆడవారికి వజ్రాల నెక్లెసూ ఎవరు ఇవ్వాలీ మొదలైన అత్యంత ముఖ్యమైన విషయాల మీద ఐక్యరాజ్య సమితి స్థాయిలో నిర్ణయాలు తీసుకుంటారు. అప్పుడప్పుడు ఈయనగారి రాక కేవలం ముందు రోజు మాత్రమే తెలిసినా ఇలాంటి మీటింగు కనీసం ఫోనులో ఐనా, రాత్రి ఒంటి గంటకైనా సరే జరిగి తీరుతుంది. ఈ మీటింగులలో మరొక ఎజెండా అంశం తసమదీయులలో, అంటే, మిగిలిన వర్గాలలో రాజకీయ పరంగా ఎవరు ఉపయోగపడతారూ, రెండో దండ వేయిస్తే డబ్బెంత ఇస్తాడూ, నిజంగానే మంత్రిగారు స్టేజి మీద ఆప్యాయంగా, అంటే అమెరికా పద్ధతిలో ఎముకలు విరక్కుండా కావలించుకుంటే దాని రేటెంత, ఇండియా పద్ధతిలో ప్రాణం విలవిలలాడేదాకా ఆలింగనమూ మరియూ వీపు గోకుడూ మొదలైన ప్రగాఢ స్నేహ పూర్వకమైన పిచ్చి వేషాలకి మొత్తం ఖర్చు అంతా పెట్టుకునే అవకాశం ఉందా అని కూడా చర్చలు జరుగుతాయి. అఫ్ కోర్స్, పది, పదిహేనేళ్ళ క్రితం ఇలాంటి డబ్బు రాబట్టుకునే సంగతులు తెలిసి చచ్చేవి కాదు కానీ, ఈ

రోజులలో ఆ ప్రోబ్లెం లేదు. ఎందుకంటే అమెరికాలో ప్రతీ ఊళ్ళోనూ ఏ వర్గంలో ఎవరు దేనికి ఎంత డబ్బిస్తారూ అనే విషయాలు అందరికీ తెలిసిపోయాయి. ఉదాహరణకి, మా ఊళ్ళో, ఎటువంటి కావలించుకునే కార్యక్రమానికైనా, కాణీ రాబట్టడానికైనా నన్ను ఎవరూ తలపరు, పిలవరు, మాట్లాడరు, అడగరు, ఉలకరు, పలకరు. ఆ మాటకొస్తే మా వర్గం వారి అందరి రెప్యుటేషనూ కూడా అంతంత మాత్రమే. ఈ పేరాగ్రాఫులో వర్గం అంటే మీకు అర్ధం అవకపోతే చెప్పుట సులభమే కానీ చెప్పిన యడల అన్ని వర్గముల వారితోనూ, మా క్వీన్ విక్టోరియా తోనూ నేను టెంకి జెల్లలు తినుట కూడా గ్యారంటీ. మా వర్గ ప్రతిష్ట "ప్రతిగ్రహం" అనగా పుచ్చుకొనుటయే మా జన్మ హక్కు. డబ్బిచ్చుట అలవాటి బుచ్చెమ్మల నాటి చచ్చు సంప్రదాయం.

ఈ జూన్-జులై -ఆగస్టు సీజన్‌లో కేవలం మంత్రులే కాక మిగిలిన ఉపపాండవులూ... అంటే ఐయేస్ ఆఫీసర్లూ, పార్టీ వినాయకులూ, వ్యాపార వేత్తలూ, కవులూ, పండితులూ, స్వామీజీలూ కూడా అమెరికా గుంపులు, గుంపులుగా అమెరికా రావడానికి మరొక ముఖ్య కారణం వాళ్ళు కళ్ళారా చూసి తరిద్దామనుకునే సినీ తారలని చూడ్డమే కాకుండా, నిజంగా, అచ్చంగా, ముఖ్యంగా ఇంపోర్టెడ్ తెలుగు హీరోయిన్‌లని క్షణం కంటే ఎక్కువగా ముట్టుకునే అవకాశాలు...ఈ మ్లేచ్ఛ ఖండంలోనే....అనగా అమెరికాలోనే, ఈ సీజన్ లోనే దొరుకుతాయి. ఎందుకంటే ఈ సీజన్‌లోనే అమెరికా తెలుగు తిరనాళ్ళు. జరుగుతాయి. గిట్టని వాళ్ళు వాటినే తానా మహాసభలనీ, ఆటా కన్వెన్షన్ అనీ పిలుస్తూ ఉంటారు.

నాకు బాగా జ్ఞాపకం..జ్ఞాపకం ఏమిటీ నా మొహం....ఆరేళ్ళ క్రితం జరిగిన సంఘటన తల్చుకుంటే నా కుడి చెయ్యి వణుకుతోంది, ఎడంచేతికి మళ్ళీ పక్షవాతం వస్తోంది. ఎందుకంటే ఒక అమెరికా తిరనాళ్ళలో నేను ఒక నాటకం వేసి, స్టేజి దిగి గ్రీన్ రూంలోకి రాగానే ఒకావిడ చుట్టూ పోలీసులతో...స్మార్ట్‌గా, అందంగా ఉండే అమెరికా పోలీసులు లెండి...పొట్టి లాగులూ, భారీ పొట్టలతో ఉండే మన వెంకట స్వాములు కాదు....అరడజను ఆర్గాన్ రైజర్లతో...సారీ.. ఆర్గనైజర్లతో విలాసంగా నిలబడి ఉంటే అనాలోచితంగా ఆ మహా సభల అధ్యక్షులవారు ఆవిడకి నన్ను పరిచయం చేశారు. ఆవిడ చెయ్యి చాపగానే నా మామూలు అలవాటు ప్రకారం నేను నా కుడి చెయ్యి పైన, దాని కింద ఆవిడ "ఈ వెధవెవడోయ్?" అనే చూపుతో ఆప్యాయంగా చాపిన కోమల హస్తమూ, మళ్ళీ దాని క్రింద నా వామ హస్తమూ కలిపి, రంగరించి కరచాలనం చేశాను. అసలు సమస్య ఏమిటంటే, ఆవిడ ఎవరో తెలిసిన మొహంలా ఉంది కానీ, తెలియదు.. ఎవరైతేనేం, బహు సున్నిత స్పర్శ అనుభవించక వాపోవుట ఎందుకూ అని అప్పటి వరకూ ...హాయిగా ఉందిగదా పోనీలే అని నేను నా మామూలు మొహంతోటే చిన్నసైజు మందహాసం చేస్తూండగా, సదరు అధ్యక్షుల వారు, నోరు మూసుకుని ఉండకుండా "మీకు తెలుసుగా, ఈవిడ ఫేమస్ బాలీఉడ్, తాలీఉడ్, టేక్ ఉడ్, సరుగుగుడు చెట్ల ఉడ్', అబ్బనీ, తియ్యనీ దెబ్బ ఫేం, శ్రీదేవి గారు, అవర్ చీఫ్ గెస్ట్ టు డే" అని ఆవిడని ఇంప్రెస్ చెయ్యడానికి తన పాండిత్యాన్ని ప్రదర్శిస్తూ, పరిచయం చేశారు. అప్పటికి మామూలు పద్ధతిలో పూర్తిగా వెనక్కి లాగేసుకున్న నా రెండు చేతులనీ శరవేగమూ, మరియు లైట్నింగ్ స్పీడ్‌తో మరొక కరచాలనం కోసం దూసుకుపోయాను. కానీ అప్పటికే ఆ నటీమణి, భర్త బోనీ కపూర్ కబంధహస్తాలలో ఇరుక్కుపోయి, అక్కడ ఉన్న మిగిలిన చచ్చు వెధవలతో కిచ కిచ లాడుతోంది. అదుగో, అప్పటినుంచీ మొదలయ్యింది నా కుడిచేతి ప్రకంపనం. ఎడం చేతి పక్షవాతం. మన సినీ హీరోయిన్లకి అంత పవర్ ఉంది కాబట్టే ప్రకంపనం, పక్షవాతం రోగాలన్నిటికీ సిద్ధపడి పైన ఉదహరించిన కవులూ, పండితులూ, మంత్రులూ ఆంధ్రాలో దొరకని అపురూప అవకాశాల కోసం అమెరికా ఈ సీజన్ లో వస్తారు అని నా అభిప్రాయం. పైగా, ఈ చెయ్యి వణకడం లాంటివి టెంపరరీలే అని మా క్వీన్ విక్టోరియాకి నచ్చ చెప్పినా. మహానటి శ్రీదేవి గారు, సన్మానానంతరం, కేవలం ఒకే ఒక మాట, "థేంక్యూ" అని అంగ్రేజీలో చెప్పిన కార్యక్రమానికి కేవలం ముప్ఫై వేల డాలర్లు మాత్రమే నిర్వాహకులు ఖర్చు పెట్టారని తెలియగానే అంత ఖరీదైన చేతిని క్షణం ముట్టుకున్న నా చేతులకి పెర్మనెంటు రోగాలు రావడంలో ఏ మాత్రం ఆశ్చర్యం లేదు. ఇలాటి ఖర్చులు పెట్టి, నాబోటి గాళ్ళని ఇలాటి కష్టాలు పెట్టవద్దనీ ఆర్గాన్ రైజర్లని...సారీ... ఆర్గనైజర్లని కోరుతున్నాను.

సినిమా తారల ప్రభావం నిరూపించడానికి మరొక ఉదాహరణ కూడా ఉదహరిస్తాను,. ఒక సారి, మా హ్యూస్టన్‌కి ఒక పెద్ద స్వామీజీ వచ్చారు.... సారీ విచ్చేశారు. అప్పుడు మా అమ్మాయి పసి పాప...కేవలం మూడు నెలలు. ఆయన ఆశీర్వచనం కోసం స్వామీజీ గారి దగ్గరకి తీసుకెళ్ళి, కాళ్ళకి నమస్కారం పెడుతూండగా, పొరపాటున మా అమ్మాయి మృదువైన చిన్న చెయ్యి ఆయన పాదాలకి తగిలింది. ఆయన ఠకీమని నాలుగు అడుగులు వెనక్కి వేసి "నా దేహం పవిత్రం. ఎవరూ ముట్టుకోకూడదు. ఆ మాత్రం తెలియదా" అని కోప్పడ్డారు. బహుశా  రాత్రి ఇంటికెళ్ళి గోమూత్రంతో స్నానం చేసి, దేహశుద్ధి చేసుకుంటారేమో, అమెరికా గోమూత్రం పనికొస్తుందో లేదో అని నేను చాలా మథన పడ్డాను. సరిగ్గా ఆ రోజు సాయంత్రం జరిగిన మహాసభలో ఒకానొక సినీతారని ఆయన ఎముకలు విరిగేలా కావలించుకోడం చూసి మా క్వీన్ విక్టోరియా గింజుకున్నా, నేను ఆశ్చర్యపోలేదు. ఎందుకంటే, సదరు సినిమా తార ఎముకలు విరిగాయి కానీ, స్వామీజీ గారు నిక్షేపంగా, ద్విగిణీకృతమైన ఉత్సాహంతో, "మానవజీవితంలో ప్రేమ పాలు" అనే అంశంపై అనర్గళంగా ప్రసంగించారు. ఇందులో  ప్రేమ అంటే నాకు తెలుసు కానీ, "ప్రేమ పాలు" అంటే ఏమిటో మరి?

అసలు విషయం ఏమిటంటే, ఎక్కడ బెల్లం ఉంటే అక్కడ దోమలు, ఈగలు ముసురుతాయి. దేముళ్ళూ, దేవతలూ ఎలాగా దిగిరారు కాబట్టి, సెకండ్ బెస్ట్ అయిన స్వామీజీలు దిగితే నరకానికి పోడం ఇష్టంలేని లక్షలమంది చుట్టుముడతారు. రాజకీయ నాయకులు వస్తే, ఆ వాసన కావలిసిన వాళ్ళు వేల కొద్దీ వాళ్ళ చుట్టూ తిరుగుతారు.. ఇక కార్పొరేట్ వారు, అంటే వ్యాపారస్తులు వస్తే బిజినెస్ డీల్స్ కోసం వందలకొద్దీ వాళ్ళ చుట్టూ తిరుగుతారు. ఎందుకూ పనికిరాని. పండితులూ, తెలుగు భాషావేత్తలూ వస్తే మర్యాద కోసం పది, పదిహేను మంది పలకరిస్తారు. సినిమా తారలు వస్తే, రాజకీయ నాయకులు, స్వామీజీలు, కార్పొరేట్ వారు, పండితులూ , నా బోటి అనామకులూ, మీ బోటి అమాయకులూ వెరసి కోట్లకొద్దీ తెలుగు వారు నీరాజనం పడతారు. ఈ సూత్రం అటు ఆంధ్రాలో ఎంత నిజమో, ఇటు అమెరికాలోనూ అంతే నిజం.. అన్నట్టు, పొరపాటున ఎవరైనా సంఘ సేవకులు వస్తే, రేపో, మాపో అనుకుంటున్న సినీ తారని అయినా సరే కూడా తీసుకెళ్ళండి.. మీ క్వీన్ విక్టోరియా కానీ, కింగ్ జార్జ్ కానీ విసుక్కోరు..గారంటీడ్...

